క్లుప్తంగా

వైద్య శిబిరం పరిశీలన



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న చెవిరెడ్డి లక్ష్మి

తిరుపతి రూరల్: ప్రభుత్వ విప్, తుడా చైర్మన్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సహకారంతో నిర్వహిస్తున్న ఉచిత ఆరోగ్య పరీక్షల శిబిరాలకు విశేష స్పందన లభిస్తోంది. శనివారం తిరుపతి రూరల్ మండలం పేరూరు, వేదాంతపురం, మంగళం, తిరుచానూరు పంచాయతీల్లో వైద్య శిబిరాలను ప్రారంభించారు. పేరూరులో జరుగుతున్న వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి పర్యవేక్షించారు. వైద్య పరీక్షలను చేయించుకున్నారు. తుడా కార్యదర్శి లక్ష్మి, సర్పంచులు దామినేటి కేశవులు, చిరంజీవిరెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలి



శిక్షణలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో కళాశాల డైరెక్టర్లు

తిరుపతి సిటీ: విద్యార్థులు ఉపాధి అవకాశాలను అందిపుచుకునేలా శ్రమించాలని ఎమరాల్డ్స్ కళాశాల డైరెక్టర్లు విశ్వనాథ్‌రెడ్డి, గిరిధర్ పిలుపునిచ్చారు. ఎమరాల్డ్స్ కళాశాల, బజాజ్ ఫిన్‌సర్వ్ సంయుక్తంగా శనివారం కళాశాల ప్రాంగణంలో విద్యార్థులకు బీఎఫ్ఎస్ఐ శిక్షణా శిబిరం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కళాశాల విద్యార్థులకు ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, కమ్యూనికేషన్ స్కిల్స్ తదితర రంగాల్లో 60 రోజులు శిక్షణ ఇచ్చామన్నారు. అనంతరం శిక్షణలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమలలో కోఆర్డినేటర్ రమేష్, మునిరత్నం, జానికిరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఆమోదయోగ్యమైన ప్రతిపాదనలతో రోడ్ల విస్తరణ

- డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి



మాట్లాడుతున్న భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి సిటీ: అందరికీ ఆమోదయోగ్యమైన ప్రతిపాదనలతోనే ఎస్వీయూలో రోడ్ల విస్తరణ చేపడతామని డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి తెలిపారు. ఆయన శనివారం ఎస్వీయూ ఉద్యోగ సంఘాల నాయలు రెడ్డి భాస్కర్‌రెడ్డి, మురళీరెడ్డి ఆధ్వర్యంలో ఎస్వీయూ సెనేట్ హాల్‌లో బోధన, బోధనేతర సిబ్బందితో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ తిరుపతి అభివృద్ధితోపాటు ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తగ్గించాలనే ఉద్దేశంతోనే 18 మాస్టర్ ప్లాన్ రోడ్లను నిర్మించే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. యూనివర్సిటీ మాస్టర్ ప్లాన్ గత ప్రభుత్వ హయాంలో తుడా ఆమోదించిందేనని గుర్తు చేశారు. యూనివర్సిటీలోని 1, 3, 4 రోడ్ల విస్తరణను విరమించుకున్నామని తెలిపారు. 5వ గేట్ ఎన్‌సీసీ నగర్ రోడ్డు విస్తరణపై అభ్యంతరాలు లేవన్నారు. యూనివర్సిటీకీ సంబంధంలేని ఇండియన్ గ్యాస్ బిల్డింగ్ లైన్ నుంచి జూ పార్క్ రోడ్డు వరకు 80 అడుగుల మాస్టర్ ప్లాన్ రోడ్డును నిర్మించనున్నామని తెలిపారు. నీటి బిల్లులు పెండింగ్‌లో వున్న కారణంగా గతంలో తెలుగుగంగ వాటర్ నిలిపివేశారని, పెండింగ్ బిల్లులను మాఫీ చేసి వర్సిటీకి 50 వేల లీటర్ల తాగునీరు అందిస్తామన్నారు. శ్వేత మాజీ డైరెక్టర్ భూమన సుబ్రమణ్యం రెడ్డి మాట్లాడుతూ నగరం అభివృద్ధి చెందాలంటే రోడ్ల నిర్మాణం, విస్తరణ ఎంతో అవసరమన్నారు. విద్యార్థులు మరుగున వుంటే సమాజం, ప్రపంచాన్ని చూడలేరని, వారి మేథో వికాసానికి గొడ్డలిపెట్టేనన్నారు. వీవీఐపీలు వచ్చే మహిళా యూనివర్సిటీ రోడ్డును పద్మావతి గెస్ట్ హౌస్ వరకు విస్తరించాల్సిన అవసరం వుందన్నారు. ప్రజలు అత్యవసర చికిత్స కోసం, ప్రాణాలను కాపాడుకునేందుకు ఆసుపత్రికి వెళ్లే రోడ్ల విస్తరణను అడ్డుకోవడం బాధ్యతారాహిత్యమన్నారు. సమావేశంలో కార్పొరేటర్ రామస్వామి వెంకటేశ్వర్లు, యూనివర్సిటీ కంప్యూటర్ సెంటర్ ఇన్‌చార్జ్ డైరెక్టర్ నాగరాజశ్రీ, అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్రీనివాసరాజు, టీచింగ్ అసోసియేషన్ నాయకులు కిషోర్, ఎస్ఎంఆర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆకేపాటి శివానందరెడ్డి, నగరపాలక సంస్థ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు ఇమ్రాన్, మైనారిటీ కార్పొరేషన్ డైరెక్టర్ ఇమామ్, విద్యార్థి సంఘం నాయకులు ప్రేమ్‌కుమార్, పెద్ద సంఖ్యలో బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొని తమ అభిప్రాయాలను తెలియజేశారు.

సాయిబాబాను దర్శించుకున్న మాజీ ఉపరాష్ట్రపతి



సాయిబాబాను దర్శించుకున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, వర్సిటీ ఛాన్స్‌లర్ మోహన్‌బాబు

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి మండలం రంగంపేటలోని మోహన్‌బాబు యూనివర్సిటీలో వెలసిన శిరిడీ సాయిబాబాను శనివారం మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు దర్శించుకున్నారు. ఆలయం వద్దకు వచ్చిన వెంకయ్యనాయకుడికి ప్రముఖ సినీ నటుడు, ఎంబీయూ ఛాన్స్‌లర్ మోహన్ బాబు, సినీనటుడు మంచి విష్ణు స్వాగతం పలికి స్వామి వారి దర్శనం కల్పించారు.

చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సహా 34 మందిపై కేసు

- అనుమతి లేకుండా నిరసన ర్యాలీ నిర్వహించడంపై పోలీసుల చర్యలు
- అరెస్టుకు రంగం సిద్ధం..?



నల్లజెండాలతో నిరసన ర్యాలీ చేస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నేతలు

తిరుపతి రూరల్: పోలీస్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చంద్రగిరి పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. పుంగనూరులో వైఎస్సార్‌సీపీ శ్రేణులు, పోలీసులపై టీడీపీ నేతల దౌర్జన్యానికి నిరసనగా వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి శనివారం చంద్రగిరిలో మౌన నిరసన ర్యాలీ నిర్వహించారు. ముందస్తు అనుమతి లేకుండా నిరసన, ర్యాలీ నిర్వహించడంతో మోహిత్‌రెడ్డితో పాటు 34 మంది వైఎస్సార్‌సీపీ నాయకులపై 341, 283, 34 ఐపీసీ సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, వైఎస్సార్ సీపీ కన్వీనర్ కొటాల చంద్రశేఖర్ రెడ్డి, చంద్రగిరి ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి, వైఎస్సార్ టీయూసీ జిల్లా అధ్యక్షుడు ఉపేంద్రరెడ్డి, ఎర్రావారిపాలెం జెడ్పీటీసీ కరుణాకర్‌రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మస్తాన్, తిరుపతి రూరల్ వైస్ ఎంపీపీ విడుదల మాధవ రెడ్డి, ఎంపీటీసీలు మూలం బాబు, బోస్‌చంద్రారెడ్డి, హరిప్రసాద్, బుల్లెట్ చంద్రమౌళిరెడ్డి, డివిజన్ కన్వీనర్లు కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి, అగరాల దేవా, నాగరాజు, ఎర్రావారిపాలెం మండల పార్టీ కన్వీనర్ చెంగల్ రెడ్డి, రామచంద్రపురం నాయకులు భాను కుమార్‌రెడ్డి, ఎద్దల చంద్రశేఖర్‌రెడ్డి, కపిలేశ్వర్‌రెడ్డి, చంటినాయుడు, శివశంకర్‌రాజు, నారాయణరెడ్డి, వెంకటపతినగర్, పేరూరు, పెరుమాళ్లపల్లి, కేసీపేట, పాడిపేట, ముండ్లపూడి, లింగేశ్వర్‌నగర్, అవిలాల సర్పంచులు చిన్నియాదవ్, దామినేటి కేశవులు, జోగిమోహన్, పిపాసి, ధనమునిరెడ్డి, సూరి, కోటేశ్వర రావు, సీవీ రమణ, నాయకులు యశ్వంత్‌రెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి, బండారు హేమచంద్ర, సాయి రాయల్, బడి వెంకటేష్ యాదవ్‌పై కేసులు నమోదు చేసినట్లు సీఐ రాజశేఖర్ తెలిపారు. రాజకీయ పార్టీలు శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులకు సహకరించాలని కోరారు. కేసు నమోదు అయిన నేపథ్యంలో వైఎస్సార్ సీపీ నాయకులను అరెస్ట్ చేసేందుకు చంద్రగిరి పోలీసులు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం.

మోహిత్‌రెడ్డిని ఆశీర్వదించండి



ప్రజలతో మాట్లాడుతున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

రామచంద్రాపురం: ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి పనులను చూసి వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని ఆశీర్వదించాలని చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి కోరారు. ఆయన శనివారం రావిళ్లవారిపల్లి పంచాయతీ బ్రాహ్మణకాల్వ, బ్రాహ్మణకాల్వ ఏఏడబ్ల్యూ, రావిళ్లవారిపల్లి, రావిళ్లవారిపల్లి ఏఏడబ్ల్యూ, శెట్టివారిపల్లి, పెద్దినాయుడుకండ్రిగ, పెద్దినాయుడుకండ్రిగ హెచ్‌డబ్ల్యూ, తొట్టికాడ ఇండ్లులో గడప గడపకూ మీ హర్షిత్ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఎంపీపీ ఏవీ బ్రహ్మానందరెడ్డి, జెడ్పీటీసీ ఢిల్లీరాణి, ఆర్సీపురం ఇన్‌చార్జి గణపతి నాయుడు, సుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీలు చంద్రశేఖర్‌రెడ్డి, మునీంద్రబాబు, రాజేష్, డివిజన్ అధ్యక్షులు భాస్కర్ రెడ్డి, బాబు యాదవ్, సర్పంచి గణపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సన్ ప్రైమ్ హాస్పిటల్ ప్రారంభం



హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

తిరుపతి కల్చరల్: ఎయిర్ బైపాస్ రోడ్డులోని అపూర్వ షోరూం సమీపంలో ఏర్పాటు చేసిన సన్ ప్రైమ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను శుక్రవారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రారంభించారు. హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ గజ్జల మహేష్‌రెడ్డి, డాక్టర్ టీజీ.పూర్ణగణేష్ మాట్లాడుతూ 50 పడకలతో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ లో అనుభవజ్ఞులైన వైద్యులతో వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. మేయర్ శిరీష, వైఎస్సార్ సీపీ నేత దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, వ్యాపారవేత్త ఉప్పలపాటి సాయి చౌదరి పాల్గొన్నారు.

చంద్రబాబువి నీచ రాజకీయాలు

తిరుపతి కల్చరల్: పుంగనూరు ఘటన చంద్రబాబు నీచ రాజకీయాలకు నిదర్శనమని వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర కార్యదర్శి మల్లావు మధు విమర్శించారు. ఆయన శనివారం ఓ ప్రైవేటు హోటల్‌లో విలేకరులతో మాట్లాడారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవం, 14 ఏళ్లు సీఎంగా వ్యవహరించిన చంద్రబాబు అధికారం కోసం అల్లర్లు సృష్టించడం సిగ్గుమాలిన చర్య అన్నారు.

టీటీడీపై సివిల్ దావా కొట్టివేత

తిరుపతి లీగల్: టీటీడీపై ఏజిలి సెక్యూరిటీ ఫోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ దాఖలు చేసిన సివిల్ దావాను తిరుపతి మూడో అదనపు జిల్లా జడ్జి కోర్టు శుక్రవారంకొట్టివేసినట్టు టీటీడీ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు ఎల్.మధుసూదన్‌రెడ్డి తెలిపారు. 2007 మే ఒకటి నుంచి 2009 ఏప్రిల్ 30 వరకు టీటీడీలో విధులు నిర్వహించేందుకు సెక్యూరిటీ గార్డులను అందజేసేందుకు ఏజిలి సెక్యూరిటీ ఫోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఒప్పందం చేసుకుంది. రెండేళ్లు పూర్తయిన తరువాత తిరిగి ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. టీటీడీ 26 రోజుల పని దినాలకు మాత్రమే జీతం ఇచ్చిందని, నెలలో 30, 31 రోజులకు కూడా చెల్లించాలని ఏజెన్సీ టీటీడీని కోరింది. 2009, ఆగస్టు నుంచి 2011 వరకు టీటీడీ ఏజెన్సీకి రూ.31,20,062 చెల్లించాలని, ఆ సొమ్ముకు వడ్డీ రూ.22,46,038 కలిపి రూ.53,66,100 చెల్లించేలా టీటీడీని ఆదేశించాలని కోర్టులో దావా దాఖలు చేసింది. వాదనలు విన్న కోర్టు దావాను కొట్టివేస్తూ చెప్పింది.

ఐలు నూతన కార్యవర్గం ఎన్నిక

తిరుపతి లీగల్: ఉమ్మడి చిత్తూరు జిల్లా ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్(ఐలు) నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. తిరుపతి ఏఐఆర్ బైపాస్ రోడ్డులోని యూత్ హాస్టల్‌లో ఐలు ఐదో ఉమ్మడి చిత్తూరు జిల్లా మహాసభ ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడిగా పి.హేమచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా జె.దేవరాజులు, కార్యదర్శిగా పి.మురళి, ఉపాధ్యక్షులుగా బి.హరికృష్ణారెడ్డి, ఏ.రాజశేఖర్, సంయుక్త కార్యదర్శులుగా శ్రీనివాసులు, షాజహాన్, కార్యనిర్వాహక కార్యదర్శిగా సి.వెంకటయ్య, కోశాధికారిగా ఎస్.సుబ్రమణ్యం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఐక్యతతోనే గిట్టుబాటు ధర

తిరుపతి కల్చరల్: ఏపీలో రైతులు ఐకమత్యంగా ఉంటేనే పంటలకు గిట్టుబాటు ధర కచ్చితంగా లభిస్తుందని రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి తెలిపారు. ఇస్కాన్ రోడ్డులోని టీటీడీ మైదానంలో ఏర్పాటు చేసిన రాయలసీమ ఆర్గానిక్ మేళాలో రెండో రోజు శనివారం నిర్వహించిన ఫుడ్ ప్రాసెసింగ్ కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. ఆయన మాట్లాడుతూ పంటలకు గిట్టుబాటు ధర దక్కాలంటే రైతులు ఐక్యంగా ఉంటూ రైతు ఉత్పత్తిదారుల సంస్థలో సభ్యులుగా చేరాలని సూచించారు. తద్వారా అధిక సబ్సిడీలతోపాటు ఈక్విటీ గ్రాంట్ కింద రూ.15 లక్షలు ఇస్తామని తెలిపారు. రాష్ట్రంలో సుమారు 700కు పైగా రైతు ఉత్పత్తిదారుల సంస్థలున్నాయని, ఈ సంఖ్యను మరింత పెంచుతామని చెప్పారు. భారతీయ కిసాన్ సంఘ్ జాతీయ ప్రధాన కార్యదర్శి మోహిని మోహన మిశ్రా, రైతు సాధికార సంస్థ మార్కెటింగ్ అధికారి బి.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

భూరక్షణకు జగనన్న భరోసా

చంద్రగిరి(తిరుపతి రూరల్): జగనన్న శాశ్వత భూ రక్ష – భూ హక్కు పథకం కింద చంద్రగిరి మండలం నరసింగాపురం పంచాయతీలో అర్హులకు యునిక్ నంబర్‌తో కూడిన యాజమాన్య ఆస్తి ధ్రువీకరణ పత్రాలను వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి శనివారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పైలెట్ ప్రాజెక్టు కింద తిరుపతి జిల్లాలో చంద్రగిరి మండలం నరసింగాపురం పంచాయతీ ఎంపికైందన్నారు. సర్వే ప్రక్రియను పూర్తికావడంతో అర్హులకు శాశ్వత చట్ట బద్దత కల్పించే పత్రాలు అందించడం శుభ పరిణామమన్నారు. పంచాయతీలో 29.6 ఎకరాలు సర్వే చేశారని, ఇందులో 807కు గాను 441 మందికి ధ్రువీకరణ పత్రాలు అందించినట్టు తెలిపారు. ఎంపీపీ హేమేంద్ర కుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ యుగంధర్ రెడ్డి పాల్గొన్నారు.



సంబరాలు



గంగమ్మ ఆలయం వద్ద కొబ్బరికాయలు కొడుతున్న ఉదయ్ వంశీ, పసుపులేటి సురేష్, తాళ్లూరి ప్రసాద్, మహిళలు

ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి టీటీడీ చైర్మన్‌గా నియమితులైన సందర్భంగా వైఎస్సార్ సీపీ నేతలు సంబరాలు జరుపుకున్నారు. అలిపిరి, గంగమ్మ ఆలయం వద్ద టెంకాయలు కొట్టారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆర్టీసీ వైఎస్సార్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నేతలు సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు.

–తిరుపతి కల్చరల్/తిరుపతి అర్బన్



అలిపిరి పాదాల మండపం వద్ద కొబ్బరికాయలు కొడుతున్న వైఎస్సార్ సీపీ మహిళా నేతలు



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న వైఎస్సార్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నేతలు

మామిడితోటల సంరక్షణపై అవగాహన

చంద్రగిరి(తిరుపతి రూరల్): సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే మామిడిలో అధిక దిగుబడి సాధించవచ్చని చంద్రగిరి మండల ఉద్యాన అధికారిణి శైలజ తెలిపారు. ఆమె శనివారం పనపాకంలో మామిడి తోటల్లో కొమ్మ కత్తిరింపులు, చీడపీడల నివారణకు మందుల వాడకంపై వివరించారు. ప్రియాంక, రైతులు పాల్గొన్నారు.

సుందరీకరణ పనులు వేగవంతం చేయండి

తిరుపతి తుడా: తిరుపతి నగరంలో అభివృద్ధి పనులు పూర్తయిన ప్రాంతంలో సుందరీకరణ పనులను వేగవంతం చేయాలని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత అధికారులను ఆదేశించారు. ఆమె శనివారం ఫ్రీ లెఫ్టులు, రోడ్ల విస్తరణ ప్రాంతాలను పరిశీలించారు.

కోర్టు ఆవరణను పరిశీలించిన న్యాయమూర్తి

తిరుపతి లీగల్ : తిరుపతి మూడవ అదనపు జిల్లా జడ్జి గురునాథ్ శనివారం స్థానిక కోర్టు ఆవరణలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మరుగుదొడ్లు, కోర్టు భవనాలను పరిశీలించి కోర్టు సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ఆరోగ్యకర సమాజం కోసం కృషి చేయాలి

రామచంద్రాపురం: ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి విద్యార్థులు కృషి చేయాలని పద్మావతి మహిళా వర్సిటీ వీసీ భారతి తెలిపారు. మండలంలోని వెంట్రామాపురం సమీపంలోని సెవెన్‌హిల్స్ ఫార్మసీ కళాశాలలో శనివారం చివరి సంవత్సరం ఫార్మా–డి విద్యార్థులు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ప్రిన్సిపాల్ నిరంజన్‌బాబు మాట్లాడుతూ ఫార్మా–డి విద్యార్థులకు డ్రగ్ సేఫ్టీ అసోసియేట్స్‌గా, ఫార్మా కోవిజిలెన్స్, క్లినికల్ ట్రయల్స్ విభాగంలో అవకాశాలు ఉన్నాయని తెలిపారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించండి

తిరుపతి ఎడ్యుకేషన్ : వినియోగదారుల హక్కులు, బాధ్యతలపై విద్యార్థి దశ నుంచి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని జిల్లా పౌర సరఫరాల అధికారి కె.రాజారఘువీర్ తెలిపారు. ఎస్వీయూ క్యాంపస్ స్కూల్లో శనివారం జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన సోషియల్ టీచర్లకు ఒక రోజు శిక్షణ ఇచ్చారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యవంతమైన జీవితం

తిరుపతి సిటీ: చిరుధాన్యాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని ఎస్వీయూ వీసీ రాజారెడ్డి తెలిపారు. అంతర్జాతీయ చిరుధాన్యాల దినోత్సవం సందర్భంగా శనివారం ఎస్వీయూ హోమ్ సైన్స్ విభాగంలో ర్యాలీ చేశారు. వీసీ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ తులసి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులతోనే చిరుధాన్యాల ప్రాముఖ్యత ప్రజల్లోకి తొందరగా చేరుతుందన్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు

తిరుమల: ఘాట్ రోడ్డులో శనివారం బైక్‌ను కారు ఢీకొనడంతో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానిక బాలాజీ నగర్‌కు చెందిన ముని బైక్‌లో తిరుమల నుంచి తిరుపతి వెళుతున్నాడు. 28 మలుపు వద్ద కారు ఢీకొంది. మునిని ఘాట్ రోడ్డు భద్రతా సిబ్బంది బర్డ్ ఆస్పత్రికి తరలించారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారం

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతిలోని జూనియర్ కళాశాలల్లో జూనియర్ ఇంటర్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ఇవ్వనున్నట్టు మాస్టర్‌మైండ్స్ విద్యా సంస్థ అడ్మిన్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు 8978180843, 8008577927లో పేర్లు నమోదు చేసుకోవచ్చని తెలిపారు.